



ఖాద్రీశుడి సన్నిధిలో భక్తుల సందడి



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కదిరిలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం పుష్యమాసం, సంక్రాంతి సెలవులు కారణంగా శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శంచుకోవడానికి శుక్రవారం రాత్రే చేరుకున్నారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయ అధికారులు భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు. - **ఆంధ్రజ్యోతి, కదిరి**



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, పాటలు పాడుతున్న గాయకులు

కన్నులపండువగా శ్రీనివాస కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసుడు

పుట్టపర్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస కల్యాణోత్సవాన్ని వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో సత్యసాయి సేవా సంస్థలు, తిరుపతి తిరుమల దేవస్థానం సంయుక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. వేదపండితులు పట్టువస్త్రాలను శ్రీనివాసులు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అలంకరించి పూజలు చేశారు. గంట పాటు శ్రీనివాస కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేదమంత్రాల మధ్య స్వామి వారి తరపున పండితులు అమ్మవార్లకు మాంగళ్యధారణ చేశారు. అనంతరం యజ్ఞాన్ని పూర్ణాహుతితో ముగించారు. వేలాది మంది భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి శ్రీనివాసం పేరిట సత్యసాయి యూత్ బాలవికాస్ చిన్నారులు, డ్యాన్స్ డ్రామాను నిర్వహించారు. సంగీత నృత్యంతో భక్తులను అలరింపచేశారు.



మంగళ్యధారణ చేస్తున్న పండితులు, పట్టువస్త్రాలను తీసుకు వస్తున్న ఆర్‌జేరత్నాకర్ దంపతులు

అక్రమ మద్యంపై నిరంతర దాడులు

సరిహద్దుపై ప్రత్యేక నిఘా
నకిలీ మద్యం విక్రయాలపై విచారణ
ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

పుట్టపర్తి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి ప్రవేశిస్తున్న అక్రమ మద్యంపై నిరంతరం దాడులు నిర్వహిస్తున్నామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్ వెల్లడించారు. ఇటీవల జిల్లాలో కర్ణాటక మద్యం రవాణా, నకిలీ మద్యం, కల్తీకల్లుపై దాడుల గురించి శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ పాలసీ నిబంధనల ప్రకారం జిల్లాలో 87 ప్రైవేట్ మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలోనే సుదీర్ఘ కర్ణాటక సరిహద్దు ఉన్న జిల్లా అన్నారు. ధరల్లో వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా కాకుండా జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నిరంతర నిఘా పెట్టి దాడులు చేస్తున్నామన్నారు. గత సంవత్సరం అక్టోబరు నుంచి డిసెంబరు దాకా 306 కేసులు నమోదు చేసి 310 మందిని అరెస్టు చేశామని, 1740 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. 142 బెల్టు దుకాణాలపై దాడులు చేసి 146 మందిని అరెస్టు చేశామని, 378 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, కల్తీకల్లు ప్రభావం అత్యధికంగా ఉన్న హిందూపురంపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు చేస్తూ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హిందూపురం పరిధిలో దాడులు చేసి 31 లీటర్ల నకిలీ మద్యం స్వాధీనం చేసుకుని, 10 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. నకిలీ మద్యం అమ్మకాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందన్నారు.

కుష్ఠుపై అపోహలు తొలగించండి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత ఉండాలి
డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం కుష్ఠువ్యాధి నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం ఆధ్వర్యంలో ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గణేష్‌కూడలిలో మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కుష్ఠువ్యాధిపై ప్రజల్లో ఉన్న ఆపోహలను తొలగించి సరైన అవగాహన కల్పించాలన్నారు. వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్సలను అందించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ.. జిల్లాలో కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డీఎల్‌ఏటీఓ తిప్పయ్య ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరక్టర్ నివేదిత, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, డిప్యూటీ డెమో బాబాఫక్రోద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




అసలే వర్షాలు అంతంత మాత్రం.. వర్షం వచ్చినా నీటి నిల్వకు ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు బోర్లపైనే ఆధారపడుతున్నారు. వెయ్యి అడుగుల వరకు బోర్లు వేసి నీటిని తోడుకుంటున్నారు. వర్షాధార పంటలు చేతికొచ్చే పరిస్థితి లేకపోవడంతో బోర్ల ద్వారా పండ్లతోటలు సాగుచేసుకుంటున్నారు. బోర్లలో కూడా నీటి మట్టం పాతాళానికి పడిపోతోంది. ఇటీవల తనకల్లు మండలంలో ఆర్‌డబ్ల్యూఐ, జనజాగృతి సంస్థలు భూగర్భ జలాలపై చేసిన సర్వే రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

పాతాళంలో జలం..!

పండ్లతోటలపై ప్రభావం
ఆందోళనలో రైతులు
సామాజిక కట్టుబాట్లే శరణ్యం



బోరులో భూగర్భ జలాల కొలతలు తీస్తున్న సాంకేతిక నిపుణులు, రైతులు



వర్షపాతాన్ని కొలతలు వే స్తున్న దృశ్యం

తనకల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాధార పంటలు చేతికి రాక నష్టపోతున్న రైతులు.. ఇప్పుడు బోర్లు, బావుల్లో కూడా నీరు అడుగంటిపోవడంతో పండ్లతోటలను రక్షించుకోవడం ఎలా అని భయపడిపోతున్నారు. తనకల్లు మండలంలోని ఎగువ ప్రాంతమైన మల్లిరెడ్డిపల్లి, గేమేనాయక్ తండా, తవళం గ్రామాలతో మరికొన్ని చోట్ల నీటి మట్టం పడిపోయిందని ఇటీవల సర్వేల ద్వారా వెలుగు చూసింది. ఈ ప్రాంతంలో చెప్పుకోదగ్గ నీటి పారుదల ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, జలాశయాలు లేవు. దీంతో ఇక్కడి ప్రజలు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వర్షాలు తగ్గిపోతుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌కు చెందిన రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ (ఆర్‌డబ్ల్యూఐ), జనజాగృతి సంస్థ మండలంలోని మల్లిరెడ్డిపల్లి, గేమేనాయక్ తండా, తవళం, చీకటిమానుపల్లి గ్రామ పంచాయతీల్లో 19 పల్లెలను ఎంపిక చేసుకుని భూగర్భ జలాలపై నిపుణులతో అధ్యయనం చేసింది. వివిధ గ్రామాల్లో రైతులతో కలిసి పంట- నీరు ప్రణాళికలను తయారు చేసింది. ఆయా ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు మొత్తం భూభాగాన్ని లెక్కించి ఈయేడాదిలో పడిన వర్షపాతం, ఎంత నీరు భూమిలోకి ఇంకింది అన్న విషయాలను సాంకేతికతో పరిశీలించారు. గత ఏడాది జూన్ నుంచి అక్టోబర్ వరకు 699.47 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇందులో 10 శాతం భూగర్భ జలాలుగా లెక్కిస్తే 69.947 హెక్టామీటర్లు నీరు భూమిలోకి ఇంకినట్లు సాంకేతికతో తెలుస్తోంది. ఈ ఖరీఫ్‌లో రైతులు మల్లిరెడ్డిపల్లి, గొళ్లపల్లి, ఎర్రబల్లి గ్రామాల వద్ద సాగుచేసిన 272 ఎకరాల వివిధ రకాల పంటలు, ఆ గ్రామాల్లో ఉన్న పశువులు 836, జనాభా 1,128 మందికి తాగు నీరు, ఇతర అవసరాలకోసం 63.260 హెక్టామీటర్ల నీటిని ఖర్చు చేశారు. భూమిలో మిగిలిన నీరు గత యేడాదికి 6.687 హెక్టామీటర్లు కాగా, నవంబరు నుంచి సాగు చేస్తున్న వివిధరకాల రబీ పంటలకు 39.767 హెక్టా మీటర్ల అవసరమవుతున్నాయి. మిగులు జలాలు పోను 11.69 హెక్టా మీటర్లు నీరు తక్కువ వచ్చే ప్రమాదమున్నట్లు గుర్తించారు. గేమేనాయక్‌తండా పంచాయతీలోని రామ్లునాయక్‌తండా, మొగిలిచెట్లతండా గ్రామాల వద్ద చెరువులు కుంటలు, భూభాగంలో పడిన వర్షం ద్వారా 64.677 హెక్టా మీటర్ల నీటి నిలువలుండగా, సాగుచేసిన 203 ఎకరాల్లో వివిధ రకాల పంటలు, 421 మంది జనాభా, 1,466 పశువులకు, 43.243 హెక్టామీటర్లు నీటిని ఆరు నెలల్లో ఖర్చు చేశారు. మిగిలిన భూగర్భంలో ఈయేడాదికి 21.433 హె.మీ. నిలువ ఉండగా, రబీలో పంటలకు 44.453 హె.మీ. నీరు అవసరమవుతున్నాయి. ఈ గ్రామాల్లో కూడా 16.096 హె.మీ. నీరు తక్కువ వచ్చే ప్రమాదమున్నట్లు గుర్తించారు. అదే విధంగా మల్లిరెడ్డిపల్లి పంచాయతీలోని వడ్డుమరవపల్లి, పెద్దపల్లి, సుబ్బరాయునిపల్లి, నక్కరాళ్లతండా, నడిమికుంటపల్లి, రత్నగిరి, తవళం, చీకటిమానుపల్లి పంచాయతీల్లోని మార్పురివాండ్లపల్లి, పెద్ద ఎద్దువారిపల్లి, పడమటివారిపల్లి, రాగినేపల్లి, కుర్మాలపల్లి, చిన్నఎద్దులవారిపల్లి, గేమేనాయక్‌తండాకు నీరు తక్కువ వచ్చే ప్రమాదముందని సాంకేతికత ద్వారా తీసిన లెక్కలు చెబుతున్నాయి. ఎర్రగుట్టపల్లి వద్ద ఎలాంటి కుంటలు, చెరువులు లేకపోవడంతో ఆ ప్రాంతంలోని భూభాగాన్ని, పడిన వర్షాన్ని లెక్కించగా 25.494 హె.మీ. నీరు అందుబాటులో ఉండగా.. ఖరీఫ్‌లో 131 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు, 833 జనాభా, 1,195 పశువులకు 28.494 హె.మీ. నీరు ఖర్చు చేశారు. ఖరీఫ్‌లోనే మూడు హె.మీ. నీరు తక్కువ ఉండగా, రబీలో 51 ఎకరాల్లో పంటలు సాగుచేయడానికి ప్రణాళికలు చేశారు. ఈ పంటల కోసం 9.150 హె.మీ. నీరు అవసరం కాగా, 6.744 హె. మీ. నీరు తక్కువ రానున్నాయి. ఈ విషయాలపై గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించడంతో రైతులు అడుగంటిపోతున్న భూగర్భజలాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట-నీరు ప్రణాళికలు నిర్వహించడంతో భూగర్భలాల పరిస్థితిని గ్రామస్థులు గుర్తించారు. సామాజిక కట్టుబాట్లతోనే అడుగంటిపోతున్న భూగర్భజాలాలను పరిరక్షించడానికి అవకాశమున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు, భూగర్భజలాలపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భూగర్భజలాలపై అవగాహన కల్పించాలి



భూగర్భజలాలపై అవగాహన లేకపోవడం, ఏదోరకంగా పంటలు సాగు చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో రైతులు విచ్చలవిడిగా బోర్లు వేస్తున్నారు. తద్వారా నష్టపోతున్నారు. భూగర్భజలాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రస్తుతం నీటి కోసం వెయ్యి అడుగుల వరకు బోర్లు వేస్తున్నారు. ఇలాగే బోర్లు వేసుకుంటూ పోతే.. భవిష్యత్తులో ఇంకా ఎంత లోతులో బోర్లు వేయాల్సి ఉంటుందో తలచుకుంటేనే ఆందోళన కలుగుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు భూగర్భజలాలపై అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది.

- నాగమల్లు, మాజీ సర్పంచ్, మల్లిరెడ్డిపల్లి

సామాజిక కట్టుబాట్లే శరణ్యం



తనకల్లు మండలంలోని నాలుగు పంచాయతీల పరిధిలోని 19 గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఐ ప్రాజెక్టు ద్వారా పంట-నీరు ప్రణాళికలపై సర్వేలు నిర్వహించాం. భూగర్భజలాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాం. సామాజిక కట్టుబాట్ల ద్వారానే భూగర్భజలాల వాడకంలో మార్పులు తీసుకురావడానికి అవకాశముంది. గ్రామాల్లోని ప్రజలందరూ కలిసి నిర్ణయాలు తీసుకుని, అమలు చేయడం ద్వారా భూగర్భజలాలను సంరక్షించవచ్చు. ఇందుకు ప్రభుత్వం తమవంతు సహకారం అందించాలి. **- బలరాం, సీఈఓ, జనజాగృతి సంస్థ**

బడుగుల ఆశాజ్యోతి ఎన్టీఆర్

టీడీపీ నాయకులు, కార్యకర్తల ఘన నివాళి
జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



మిట్టమీదపల్లి ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి నందమూరి తారకరామారావు అని పలువురు టీడీపీ నాయకులు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, ఆసుపత్రులు, ఇతర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పురంలో ఘననివాళి

హిందూపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం హిందూపురంలో టీడీపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు సింహాల ఎన్టీఆర్ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయం అంటే తెలియని బలహీనవర్గాలకు పదవులు ఇప్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. హిందూపురమంటే నందమూరి పురంగా పేరుగాంచిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోపాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు రమేష్, నాగరాజు, పరిమళ, షఫీ, చంద్ర, రాఘవేంద్ర, మంజుల, దుర్గానవీన్, అమర్నాథ్, వెంకటేశ్, బాచి, శీన, శివశంకర్, బాబు, ప్రవీణ్, పాల్గొన్నారు.

జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి: కందికుంట



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి పీవీఆర్ గ్రాండ్ వరకు ర్యాలీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన ఆశయాలను టీడీపీ కొనసాగిస్తోందన్నారు. శిబిరంలో 340 మంది రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పర్వీనాభాను, డైమండ్‌ఇర్ఫాన్, అనిల్‌కుమార్‌రెడ్డి, కొమ్మినేని గంగయ్యనాయుడు, సత్యమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

తెలుగుజాతి ఖ్యాతి : పల్లె సింధూర



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పల్లె సింధురారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతికి ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కొత్తచెరువులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... సినీ రంగంలోనే కాకుండా రాజకీయరంగంలో రాణించిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చుతున్నారన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం: కలెక్టర్



జగరాజుపల్లిలో వీధులను పరిశీలిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని, వాటిని పరిశుభ్రంగా ఉంచుకుందామని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శనివారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాను పరిశుభ్ర జిల్లాగా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపడానికి అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీపీఓ సమత, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, స్పెషలాఫీసర్ సుబదాస్, ఎంపీడీఓ క్రిష్టారెడ్డి తహసీల్దార్ అనుపమ, సర్పంచ్ లక్ష్మీనరసింహ, పాల్గొన్నారు.

మనమే శుభ్రపరుచుకుందాం : ఎంపీ



పెనుకొండలో పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రం చేస్తున్న ఎంపీ పార్థసారథి

పెనుకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకుందామని, రోడ్లపై అనవసరంగా చెత్తవేసి ఆరోగ్యాలను పాడు చేసుకోవడం మంచిదికాదని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా పెనుకొండ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో ఎంపీ పార్థసారథి, టీడీపీ నాయకులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది కలిసి రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు జీవీపీ నాయుడు, కేశవయ్య, లక్ష్మీనారాయణ, వడ్డె శ్రీనివాసులు, దేవానరసింహప్ప, రొద్దం నరసింహులు, సుబ్బలక్ష్మమ్మ, శ్రీనివాసులు, హుజురుల్లాఖాన్, రియాజ్, మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, ఆర్ఐ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం

పెనుకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నాదబ్రహ్మ త్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవాలు స్థానిక వృషభాద్రి గానబృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి స్థానిక కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 20మంది సుశిక్షులైన మహిళలు త్యాగరాజులవారి సంకీర్తనలను, పంచరత్న కీర్తనలను వీనులవిందుగా ఆలపించారు. శ్రోతలు మంత్రముగ్ధులయ్యారు. హిందూపురానికి చెందిన వోకల్ వీణ విద్వాంసులు భరద్వాజ్, ఉద్దండ విద్వాంసులు సుధీర్‌కుమార్ వాయిద్య సహకారం అందించారు. ముఖ్య అతిథులుగా హిందూపురం సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్త, భాస్కర్, కాశీ విశ్వనాథ్, బ్యాంక్ మేనేజర్ ఫణిరాజ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ప్రైవేటు వాహనాల బాదుడు
• సంక్రాంతి వంకతో రెట్టింపు వసూళ్లు
• నిబంధనల ఉల్లంఘన.. • పట్టించుకోని అధికారులు
7

కార్పొరేషన్లకు పూర్వ వైభవం
• బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు
• స్వయం ఉపాధి... • మెడికల్ షాపులకు రుణాలు విడుదల

పట్టుకోండి చూద్దాం..!
• గోవా లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడి సవాల్
• నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసుల ముమ్మర గాలింపు
6

భూమిరాంగ్..!
• సాగులో ఉన్నా ఆన్‌లైన్‌లో తొలగింపు
• ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ఆటా.. పాటా.. మాదే..!


సూ్కలుకు సెలవు.. అంటే పిల్లలకు పండగే..! ఇంటి వద్ద, వీధుల్లోనూ పగలంతా ఆడిపాడుతుంటారు. మరి సంక్రాంతి సందర్భంగా పదిరోజులు సెలవులు ఇస్తే...! వారి సంబరానికి ఆకాశమే హద్దు. రోజుకొక ఆట, పాటతో మైమరచిపోతారు. రోజులు గంటలు, నిమిషాల్లా వేగంగా గడిచిపోతాయి. అలా ఇప్పటికే పండుగకు ఇచ్చిన సెలవులు తొమ్మిది రోజులు గడిచిపోయాయి. ఈక్రమంలో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అందుకే ఉన్న ఒక్కరోజును కూడా వదలకుండా పిల్లలంతా కొందరు పెద్దలతో కలిసి సరదగా గడిపేస్తున్నారు. అనంతపురం, కూడేరు ప్రాంతాల్లో శనివారం పిల్లలు ఆడుకుంటుండగా 'ఆంధ్రజ్యోతి' తీసిన చిత్రాలు ఇవి.

ఈ ఆట మీకు తెలుసా..?



జల్లిపల్లిలో అచ్చనగాయలు ఆడుతున్న బాలికలు

మంచి ఫోజు ఇవ్వరా..!



రేయ్ మనల్నే ఫొటోలు తీస్తుండారు.. మంచి ఫోజు ఇయ్యల్ల..

లే.. కొడితే గుండు అవతల పడల్ల..!



కూడేరులో గోళీలాట ఆడుతున్న బాలలు

ఊగే ఊగే ఉయ్యాలా..



అనంతపురం హౌసింగ్‌బోర్డు పార్కులో పిల్లలు, పెద్దల సరదా

ఘుమ ఘుమలు..



ఉత్తుత్తి వంటలు.. భలే రుచిగా ఉంటాయి..

నా చేతిలో విష్ణు చక్రం



దారంతో ఆట వస్తువును తిప్పుతున్న బాలిక





రేకుల షెడ్డులో నిల్వ చేసిన గోవా మద్యం, ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి

పట్టుకోండి చూద్దాం..!

- గోవా లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడి సవాల్
- నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసుల ముమ్మర గాలింపు
- కాసింత క్లూ దొరకనివ్వని 'బూసుపల్లి'

అనంతపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చేతనైతే పట్టుకోండి చూద్దాం ..! అంటూ గోవా మద్యం అక్రమ రవాణా, విక్రయం కేసుల్లో ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులకు సవాల్ విసిరుతున్నాడు. గత కొన్ని రోజులుగా అతడి కోసం ఎక్సైజ్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నా దొరకడం లేదు. గతేడాది డిసెంబరు 9న రాప్తాడు రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన 474 బాక్సుల గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. దీని విలువను ఏపీ మద్యం ధరల ప్రకారం రూ.44 లక్షలుగా లెక్కగట్టారు. అప్పట్లో తొలి రోజు ఐదుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరందరికి ఎక్సైజ్ కోర్టు రిమాండ్ విధించింది. తాజాగా ఆ నిందితులకు బెయిల్ మంజూరైంది.

బూసుపల్లిని పట్టుకునేదెన్నడో..?

గోవా అక్రమ మద్యం కేసులో ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. అతడి కోసం నెల రోజులుగా ఎక్సైజ్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. రెండు బృందాలుగా విడిపోయి నెల్లూరు, హైదరాబాద్, కర్ణాటక, అనంతపురం సమీప ప్రాంతాల్లో గాలించారు. అయితే ప్రధాన నిందితుడు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకోవడంతో సాంకేతికంగా అతడి ఆచూకీ కనుక్కోవడం పోలీసులకు కష్టమవుతోంది. తన స్థానంలో ఇతరులను నిందితుడిగా చిత్రీకరించేందుకు తొలి రోజుల్లో ప్రధాన నిందితుడు పలు రకాలుగా ప్రయత్నించినట్లు సమాచారం. తన స్థానంలో లొంగిపోయేందుకు కొందరితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అయితే అప్పటికే ఎక్సైజ్ ఉన్నతాధికారులు ప్రధాన నిందితుడి ఫొటో సేకరించడం, మీడియాలో కూడా ఫొటోతో కథనం రావడంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టినట్లు సమాచారం. ఇప్పటికే అరెస్టు చేసిన నిందితులతో ప్రధాన నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదన్నట్లు తెలిసింది. అనంతపురంలో తన కుటుంబ సభ్యులు ఉంటున్న ఇంటిని ఖాళీ చేసి, మరో ప్రాంతానికి మకాం మార్చినట్లు తెలిసింది. అయితే పాత ఇంటి యజమానికి అద్దె డబ్బులను ఫోన్‌పే చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ సెల్ నెంబర్ గురించి ఆరా తీయ గా బయట సాధారణ వ్యక్తిదని తేలినట్లు సమాచారం. ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో సాంకేతికంగా సహకరించాలని జిల్లా ఎస్పీని ఎక్సైజ్ ఉన్నతాధికారులు కోరినట్లు సమాచారం. ఇతర నిందితులను పట్టుకోవడంలో సక్సెస్ అయిన ఎక్సైజ్ పోలీసులు నెల రోజులు దాటినా ప్రధాన నిందితుడిని అరెస్టు చేయలేకపోవడంతో వారి పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నిందితుడు మద్యం అక్రమ విక్రయాల్లో దిట్టగా పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు మొదలు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదంటూ ఎక్సైజ్ శాఖలోని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

డబ్బులు సమకూర్చే వ్యక్తి కోసం గాలింపు

గోవా అక్రమ మద్యం కేసులో మరో కోణంలో ఎక్సైజ్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడికి భారీగా అక్రమ మద్యం కొనుగోలు చేసేందుకు డబ్బులు సమకూర్చే ఫైనాన్షియర్‌ను ఎక్సైజ్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఆ వ్యక్తిని పట్టుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. త్వరలోనే అతడిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. డబ్బులు సమకూర్చే వ్యక్తి దొరికితే గోవా అక్రమ మద్యం కేసులో మరిన్ని విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది.

త్వరలో పట్టుకుంటాం



గోవా అక్రమ మద్యం కేసులో ప్రధాన నిందితుడిని పట్టుకునేందుకు ముమ్మర ంగా గాలిస్తున్నాం. ఈ కేసులో ఇప్పటికే 8 మందిని అరెస్టు చేశాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన నిందితుడి కోసం ఇతర జిల్లాల్లోనూ గాలింపు చర్యలు చేపట్టాం. సాంకేతికను ఉపయోగించి ప్రధాన నిందితుడు దొరక్కుండా తప్పించుకుంటున్నాడు. పలు కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఎన్ని వేషాలు వేసినా త్వరలోనే ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డిని పట్టుకుంటాం.

- నాగమద్దయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ఎన్టీఆర్‌కు ఎంపీ అంబికా నివాళి

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్‌కు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని కేరళ రాష్ట్రం కొచ్చిలోని ఓ హోటల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికాతోపాటు పార్లమెంట్ కమిటీ ఫర్ లేబర్ చైర్మన్ బసవరాజ్ బొమ్మై, ఎంపీ హరిష్ బాలయోగి, కమిటీ సభ్యులు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ అంబికా

తెలుగు వారి కీర్తి పతాక.. ఎన్టీఆర్: బీకే

పెనుకొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగువారి కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా సగౌరవంగా నిలిపిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కొనియాడారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పార్టీ ఆవిర్భావం తరువాత రూ.2 కిలో బియ్యం, చీర, ధోతి, అందించిన ఘనత రామారావుదేనన్నారు. నివాళులర్పించిన వారిలో జీవీపీ నాయుడు, కేశవయ్య, రొద్దం నరసింహులు, సుబ్బలక్ష్మమ్మ, దేవానరసింహప్ప, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న బీకే పార్థసారథి తదితరులు

భూములకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుపై అవగాహన సదస్సులో రైతులు

యాడికి, జనవరి18(ఆంధ్రజ్యోతి): కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం సేకరించనున్న భూమికి గిట్టుబాటు ధర ఇవ్వాలని అధికారులను పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి శనివారం కమలపాడు, చింతలాయపల్లి, కుందనకోట గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టును 874.70 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో కొంత భాగం భూమిని రైతుల నుంచి సేకరించనున్నారు. అవగాహనా సదస్సులో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. ప్రాజెక్టు ఏర్పాటు వలన ఆయా గ్రామాల ప్రజలకు కలిగే లాభాల గురించి వివరించారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో సిమెంట్ ఫ్యాక్టరీలకు భూములను ఇచ్చి తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు కూడా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ప్రాజెక్టులు, ఫ్యాక్టరీల వల్ల తమకు ఏమి ఉపయోగం అని వారు అధికారులను ప్రశ్నించారు. భూములకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా ప్రాజెక్టుల ఏర్పాటు అంటూ, అభివృద్ధికి సహకరించాలంటూ రైతులను మభ్య పెట్టడం సరికాదని వారు తెలిపారు. కుందనకోట, చింతలాయపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రాజెక్టుకు కమలపాడు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుగా పేరు ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల రైతులు అధికారులకు విన్నవించారు. సమావేశంలో ఏపీ జెన్‌కో ప్రాజెక్టు డీఈ ఆంజనేయులు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నాగరాజు, ఎస్ఐ వెంకటరమణ, కమలపాడు సర్పంచు కంబగిరిస్వామి, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వోలు భీమేశ్వరరెడ్డి, గంగన్న, గ్రామసర్వేయర్ మౌలాలి పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 21న రాచానపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయి జూనియర్ బాల, బాలికల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. 2004 జనవరి 1 తరువాత జన్మించినవారు పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెలాఖరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9949279330, 9398969691లను సంప్రదించాలని కోరారు.

నేడు ఆర్డీటీ 10కే రన్, 5కే వాక్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటలకు కలెక్టరేట్ వద్ద 10కె రన్, 5కె వాక్ ప్రారంభించనున్నట్లు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటలకు ప్రారంభమై అనంత క్రీడాగ్రామంలో ముగిసే రన్, వాక్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎస్పీ జగదీష్ హాజరవుతారన్నారు. వీరితోపాటు మున్సిపల్ కమిషనర్ వినూత్న, డీఎఫ్ఓ శ్రీనివాస రెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌లతో పాటు అల్ట్రా మారథాన్ రన్నర్ జువాన్ మాన్యుయేల్‌లు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

తిరుగు ప్రయాణానికి 54 ప్రత్యేక బస్సులు

అనంతపురం కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లిన వారు యథాస్థానాలకు వస్తున్న నేపథ్యంలో 54 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లిన వారంతా ఆదివారం నుంచే యథాస్థానాలకు రావడానికి ప్రయత్నిస్తారని, అందుకే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతి తదితర నగరాల రూట్లకు 54 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే ఉంటాయని పేర్కొన్నారు. అనంతపురం నుంచి చెన్నైకు రాత్రి 9.30 గంటలకు, చెన్నై నుంచి అనంతపురానికి రాత్రి 9 గంటలకు, అనంతపురం నుంచి విజయవాడకు రాత్రి 8.30 గంటలకు, విజయవాడ నుంచి అనంతపురానికి రాత్రి 9 గంటలకు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు.

భూమిరాంగ్..!

- సాగులో ఉన్నా ఆన్‌లైన్‌లో తొలగింపు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- బ్యాంకర్ల ఒత్తిడితో విలవిల



ఆన్‌లైన్ నుంచి తొలగించిన రైతు ఎరికిల పుల్లప్ప చీనీ తోట



రత్నమ్మ సాగు చేసిన వేరుశనగ పంట పొలం


కూడేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరుల భూములను వైసీపీ పాలనలో ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకర్ల ఒత్తిడి ఎక్కువైందని, అధికారులు విచారణ చేసి తమ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఎన్ని పోరాటాలు చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. ఇదంతా మండలంలోని ఉదిరిపికొండ గ్రామ రైతుల వ్యథ. ఉదిరిపికొండ గ్రామమే కాదు మండలంలోని చాలా రెవెన్యూ గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. 2020 సంవత్సరంలో మండల వ్యాప్తంగా దాదాపు 13 వందల మంది రైతులు భూములను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేయకుండా ఏకపక్షంగా భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో అన్నదాతలు భగ్గుమన్నారు. తాము సాగు చేస్తున్న భూములను ఎలా తొలగించారని అధికారులను ప్రశ్నించారు. అయితే ఇవన్నీ ట్రైనీ కలెక్టర్ తొలగించారని, అప్పటి రెవెన్యూ అధికారులు చెప్పి తప్పించుకున్నారు. అప్పటి నుంచి అన్నదాతలు తమ భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం దక్కలేదు.

కూటమి ప్రభుత్వంపై ఆశ

రాష్ట్రంలో వైసీపీ పాలనలో భూముల సమస్యలతో అన్నదాతలు సతమతమవుతున్నట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. సమస్యలను అర్జీల రూపంలో రైతుల నుంచి తెలుసుకుని పరిష్కారం దిశగా అడుగులు వేస్తుండటంతో అన్నదాతలకు ఆశలు చిగురించాయి. మండలంలో 13 రెవెన్యూ గ్రామాల నుంచి వివిధ సమస్యలతో అన్నదాతలు 500 వినతులు అందించారు. అత్యధికంగా ఉదిరిపికొండ రెవెన్యూ గ్రామంలోనే 123 అర్జీలు వచ్చాయి. ఆ గ్రామంతోపాటు ఇప్పేరు 91, కల్లగళ్ల 66, తిమ్మాపురం 45, కూడేరు 43, చోళసముద్రం 23, మరుట్ల 21, గొట్కూరు 21, కమ్మూరు 16, కొర్రకోడు 15, జయపురం 14, బ్రహ్మణపల్లి 12, ఎంఎంహళ్లి 10 అర్జీలు అధికారులకు అందించారు. ఎక్కువగా సాగు చేసిన భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, రస్తా వివాదాలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అర్హులకు న్యాయం చేస్తాం

రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందించిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. భూములు సాగు చేస్తూ ఆన్‌లైన్‌లో లేకపోతే అలాంటి రైతులను గుర్తించి, నివేదికలు తయారు చేసి అసైన్మెంట్ కమిటీలో న్యాయం చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపి, అర్హులకు న్యాయం చేస్తాం.



- మహబూబ్‌బాషా, ఇన్‌చార్జ్ తహసీల్దారు, కూడేరు

న్యాయం చేయాలి



నా భార్య నా భార్య షమీనాబాను పేరిట కాంగ్రెస్ పాలనలో భూ పంపిణీ కింద రెండు ఎకరాలకు పట్టాతోపాటు పాసుపుస్తకాలు అందించారు. మరో రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ ఆన్‌లైన్‌లో నాలుగు ఎకరాలు నా భార్య పేరు మీద ఉండేది. అందులో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ, జల్లిపల్లి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్నాం. వైసీపీ అధికారంలోకి రాగానే మా భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎంత మంది అధికారుల వద్ద మొర పెట్టుకున్న ఫలితం దక్కలేదు. కూటమి ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.

- షేక్షావలి, రైతు, ఉదిరిపికొండ

బయట అప్పు చేసి బ్యాంకు రుణం తీర్చాం



నా పేరున ఉన్న నాలుగు ఎకరాల భూమిలో చీనీ పంట సాగు చేస్తున్న. 2015 సంవత్సరంలో నా పేరు మీద భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. వైసీపీ పాలనలో తొలగించారు. భూమిలో బోరు వేయగా పుష్కలంగా నీరు పడటంతో చీనీ పంట సాగు చేస్తున్నా. భూమిపై బ్యాంకులో అప్పుతీసుకున్నాం. ఆన్‌లైన్ నుంచి భూమిని తొలగించడంతో బ్యాంకర్లు ఒత్తిడి పెట్టారు. దీతో బయట అప్పు చేసి బ్యాంకు రుణం చెల్లించా. సాగులో ఉన్న మా భూములను ఎలా తొలగించారని రెవెన్యూ సదస్సులో అధికారులను ప్రశ్నిస్తే, విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు

- ప్రభాకర్, రైతు, ఉదిరిపికొండ

ప్రైవేటు వాహనాల బాదుడు



సంక్రాంతి వంకతో
రెట్టింపు వసూళ్లు
నిబంధనల ఉల్లంఘన
పట్టించుకోని అధికారులు

కదిరి అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ కోసం ఎక్కడికెక్కడి నుంచో సొంతూళ్లకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. సెలవులు ముగియడంతో బస్సులు, రైళ్లు రద్దీగా కనిపిస్తున్నాయి. డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేటు వాహనాల యజమానులు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగుళూరుకు వెనుదిరుగుతున్నారు. టిక్కెట్ ధరపై 50 నుంచి 70శాతం పైగా వసూలు చేస్తున్నారు. వారు ఎంత అడిగితే అంత సమర్పించుకుంటున్నారు. కదిరి నుంచి విజయవాడకు సాధారణ టిక్కెట్ రూ.840కాగా, ప్రస్తుతం రూ.1200 నుంచి రూ.1300 వసూలు చేస్తున్నారు. కదిరి నుంచి బెంగుళూరుకు ఆర్టీసీలో ఎక్స్‌ప్రెస్‌కు రూ.245, సూపర్‌లగ్జరీ రూ.360 కాగా, ప్రైవేటు వాహనంలో రూ. 350 నుంచి రూ.400 వసూలు చేస్తున్నారు. చెన్నైకి ఆర్టీసీలో రూ.620కాగా, ప్రైవేటు వాహనదారులు రూ.700 నుంచి రూ.1800 వరకు, హైదరాబాద్‌కు ఆర్టీసీలో రూ.830కాగా, ప్రైవేటు వాహనదారులు రూ. 1400 నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వాహనదారులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నా రవాణా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు : శ్రీనివాసులు, ఆర్టీఓ, కదిరి

ప్రైవేటు వాహనదారులు నిబంధనల ఉల్లంఘనపై తనిఖీలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నాం. ప్రైవేటు బస్సుల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఎక్కువ చార్జీలు వసూలు చేయకూడదు. అలాంటి వారిపై నిబంధనల మేరకు కేసులు నమోదుచేస్తాం.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో గొడవ

అనంతపురం క్రైం, జనవరి18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాసిర్ అహ్మద్ అనే వ్యక్తి శనివారం ఫొటోలు తీయడంతో గొడవ జరిగింది. దీంతో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ప్రైవేట్ వ్యక్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారని గతంలోనే నాసిర్ అహ్మద్ అనే వ్యక్తి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంగా కొన్ని రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫొటోలు, వీడియోలు తీసేవాడని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. నాసిర్ శనివారం మరోసారి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ప్రైవేట్ ఉద్యోగులు ఉంటుండటంతో ఫొటోలు తీశాడు. దీనిపై అక్కడే ఉన్న కార్పొరేటర్ భర్త రాయల్ మధు జోక్యం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ పంచాయితీ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరింది. విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని సబ్‌రిజిస్ట్రార్ యూనస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై చేయి చేసుకున్నట్లు నాసిర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా నాసిర్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు.

చిన్నారితో కలిసి తల్లి అదృశ్యం...

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యదేవ్ నగర్‌కు చెందిన కటిక అఖిల తన మూడేళ్ల కుమారుడు షాకీర్‌తో కలిసి కనిపించకుండా పోయింది. సత్యదేవ్‌నగర్‌లో దూదేకుల షెక్షావలి, కటిక అఖిల దంపతులు నివాసముంటున్నారు. ఈనెల 13న ఉదయం అఖిల ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తన కుమారుడిని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల కుటుంబాల్లో ఆరా తీసిన కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



◄ కుమారుడితో అఖిల(ఫైల్)

కార్పొరేషన్లకు.. పూర్వ వైభవం..!

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

- స్వయం ఉపాధి... మెడికల్ షాపులకు రుణాలు విడుదల
- ఆదరణ పథకంపై కసరత్తు
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు త్వరలోనే శుభవార్త

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం పూర్వవైభవం తీసుకొస్తోంది. సార్వత్రిక ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటోంది. ఇచ్చిన మాట ప్రకారం కార్పొరేషన్లకు జీవం పోస్తోంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను భ్రష్టు పట్టించింది. ఒక్కటంటే ఒక్క రుణం ఇవ్వకపోగా... ఆ కార్పొరేషన్లను నవరత్నాల దరఖాస్తుల పరిశీలనకు ఉపయోగించుకొని నిర్వీర్యం చేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆయా కార్పొరేషన్లకు గతంలో మాదిరే సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఇప్పటికే అన్ని కార్పొరేషన్ల అధికారులతో సమావేశాలు నిర్వహించి రుణాలు అందించేందుకు కసరత్తుల చేసింది. మొదటగా బీసీ కార్పొరేషన్‌కు స్వయం ఉపాధి రుణాలు, మెడికల్ షాపుల నిర్వహణకు రుణాలు ఇస్తూ బడ్జెట్‌ను కేటాయించింది. అదే విధంగా గతంలో అమలైన ఆదరణ పథకాన్ని సైతం పునరుద్ధరించేందుకు అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మరోవైపు ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అధికారులతో సైతం చర్చలు జరిపి రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ ఏడాది నుంచే రుణాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెబ్‌సైట్లను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేటగిరీల వారీగా రుణాలిలా...

బీసీ కేటగిరిలోని కులాల ఆధారంగా లోన్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్ స్కీమ్ కింద స్వయం ఉపాధి రుణాల కింద 1,953 యూనిట్లను విడుదల చేసింది. ఈ యూనిట్లకు మొత్తం రూ. 36.80 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇందులో 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు చెల్లించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో కోసం రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. కేటగిరీల వారీగా పరిశీలిస్తే... బీసీ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాదికి 1,728 యూనిట్లకు గానూ రూ. 32.90 కోట్లు కేటాయించగా... రూ. 16.45 కోట్లు సబ్సిడీ... రూ. 16.45 కోట్లు బ్యాంకు లోను కింద జమ చేయాల్సి ఉంటుంది. ఈబీసీ కార్పొరేషన్‌కు 102 యూనిట్లకుగానూ 1.77 కోట్లు మంజూరు కాగా... 88.50 లక్షలు సబ్సిడీ, 88.50 లక్షలు బ్యాంకు లోను, కమ్మ కార్పొరేషన్‌కు 58 యూనిట్లకుగానూ రూ. 1.01 కోట్లు మంజూరు కాగా... 50.50 లక్షలు సబ్సిడీ... 50.50 లక్షలు బ్యాంకు లోను, రెడ్డి కార్పొరేషన్‌కు 29 యూనిట్లకుగానూ రూ. 50 లక్షలు మంజూరు చేయగా... రూ. 25 లక్షలు సబ్సిడీ, రూ. 25 లక్షలు బ్యాంకు లోను, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 21 యూనిట్లకు రూ. 36 లక్షలు విడుదల కాగా... రూ. 18 లక్షలు సబ్సిడీ, రూ. 18 లక్షలు బ్యాంకు లోను, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 14 యూనిట్లకు రూ. 24 లక్షలు మంజూరు కాగా... రూ. 12 లక్షలు సబ్సిడీ, రూ. 12 లక్షలు బ్యాంకు లోను, క్షత్రియ కార్పొరేషన్‌కు ఒక యూనిట్‌కుగానూ రూ. 2 లక్షలు నిధులు విడుదల చేశారు.

జనరిక్ మెడికల్ షాపులకు రుణాలు...

జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ. 8 లక్షలు రుణాలు అందించనున్నారు. వీరికి 50 శాతం లబ్ధిదారుడి వాటా కింద... 50 శాతం బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం జిల్లా వ్యాప్తంగా 72 యూనిట్లకు గానూ రూ. 5.76 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో బీసీ కార్పొరేషన్ పరిధిలో 35 యూనిట్లకు రూ. 2.80 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 17 యూనిట్లకు గానూ రూ. 1.36 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 9 యూనిట్లకుగానూ రూ. 72 లక్షలు, రెడ్డి కార్పొరేషన్‌కు 5 యూనిట్లకుగానూ రూ. 40 లక్షలు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లకు 6 యూనిట్లకుగానూ రూ. 48 లక్షలు నిధులు విడుదల చేశారు. జిల్లాలో బీఫార్మసీ, డిఫార్మసీ చేసిన నిరుద్యోగ యువతకు మాత్రమే ఈ అవకాశం కల్పించారు.

అర్హతలివే....

స్వయం ఉపాధి కోసం దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకునే వారు బిఫార్మసీ, డి ఫార్మసీ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు సిద్ధం చేసుకోవాలన్నారు. అదే విధంగా రుణాలకు దరఖాస్తులు చేసుకునే వారి వయస్సు 21 నుంచి 60 సంవత్సరాలలోపు ఉండాలన్నారు.



సంతోషంగా ఉంది

ఐదేళ్లుగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు లేక ఇబ్బందులు పడ్డాను. అయితే ప్రస్తుత ప్రభుత్వం రుణాలు తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉంది. రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలు సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కింద విడుదల చేయడం ఎంతో ఉపయోకరంగా ఉంది. ఇంకా వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదని అధికారులు అంటున్నారు. వచ్చిన వెంటనే ఓ మూడు లక్షల రుణానికి సంబంధించి దరఖాస్తు చేసుకుంటాను. రుణం మంజూరైతే చిన్నపాటి బిజినెస్ చేసుకుంటాను.

- మనోజ్, నిరుద్యోగి

త్వరలోనే అందుబాటులోకి..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వయం ఉపాధి, జనరిక్ మెడికల్ షాపుల రుణాలకు సంబంధించి అర్హులైన వారు సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలి. అయితే ప్రభుత్వం రూపొందించిన https://apobmms.apcfss.in వెబ్‌సైట్ త్వరలోనే అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే ఈ వెబ్‌సైట్ గురించి రాష్ట్రస్థాయి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

జాతీయ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



పూర్ణచంద్రిక



చైత్ర



లక్ష్య మోహన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-17 జాతీయ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. 2024-25 ఎస్జీఎఫ్-17 సీజన్ క్రికెట్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన పూర్ణచంద్రిక, చైత్ర, లక్ష్యమోహన్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారిణులు ఫిబ్రవరి 3 నుంచి హరియాణాలో నిర్వహించే ఎస్‌జీఎఫ్-17 బాలికల క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటారని అధికారులు తెలిపారు. వీరు ఈనెల 27న గుంటూరులో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శులు సుగుణమ్మ, మొరార్జీయాదవ్ తెలిపారు.

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

అనంతపురం అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 20 నుంచి నెలాఖరుదాకా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పశుఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించి, ఉత్పాదకత పెంచడం, వ్యాధులను నియంత్రించడమే పశు ఆరోగ్య శిబిరాల ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి

తాడిపత్రి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని నంద్యాలరోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలచంద్ర (26) మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. సీపీఐ కాలనీకి చెందిన బాలచంద్ర రజకవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు ఆయన తెలిపాడు. బాలచంద్ర నంద్యాలరోడ్డులోని ఒక ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమానికి వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య భారతి, నాలుగేళ్ల కుమారుడు విక్రమాదిత్ ఉన్నారని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సైబర్ మోసగాడి అరెస్ట్



సాకే శివయ్య

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో అడ్మిట్ అయిన రోగి బంధువులకు ఆరోగ్య శ్రీ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేసే సైబర్ మోసగాడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్య బీఈడీ వరకు చదివాడు. అతను బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడ్డాడు. సులువుగా, అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రక్తబంధం గ్రూప్ ఆర్గనైజేషన్ ట్రస్ట్ అనే వాట్సాప్ గ్రూపులో చేరాడు. ఆ గ్రూప్‌లో ఎవరికైనా రక్తం అవసరముంటే ఆ సెల్‌నెంబర్‌కు ఫోన్ చేసి తాను ఆరోగ్యశ్రీ డిపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెబుతాడు. ఉచితంగా ట్రీట్‌మెంట్ కావాలంటే మీరు కొంత డబ్బు చెల్లించాలని చెప్పి వారి నుంచి ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా డబ్బు వేయించుకుంటాడు. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తాడు. ఈ క్రమంలో ఈనెల 13న అనంతపురం ప్రభుత్వాసుపత్రి ఆర్థోవార్డు, గైనిక్ వార్డులోని ఐదుగురు రోగుల బంధువులకు ఫోన్ చేసి, వారి నుంచి రూ.12వేలు వేయించుకుని మోసం చేశాడు. దీనిపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారించిన పోలీసులు సాకే శివయ్యను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అతను గత ఏడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకు 12మందిని మోసం చేశాడు. రూ.30వేల వరకు మోసం చేశాడు. ఎవరైనా ఇలా మోసం చేసినట్లు తెలిస్తే నమ్మకుండా సైబర్ క్రైం ఫ్రీ నెంబర్ 1930కు లేదా డయల్ 100కు ఫోన్ చేయడంతో పాటు స్థానిక పోలీసులను సంప్రదించాలని సీఐ శ్రీకాంత్ కోరారు.

నేడు డీఎంఏ రాక..?

అనంతపురం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డీఎంఏ) హరి నారాయణ ఆదివారం నగరపాలికకు రానున్నట్లు తెలిసింది. నగరంలోని ప్యాచ్‌వర్క్‌లను ఆయన పరిశీలించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కడప జిల్లాలో ఉన్న డీఎంఏ ఆదివారం రావచ్చని లేదా మరో మున్సిపాలిటీని సందర్శించే అవకాశం ఉందని తెలిసింది.



శింగనమల చెరువు



టీడీపీ హయాంలో మరువ లైనింగ్ పనులు చేసిన దృశ్యం

అభివృద్ధికి అడుగులు..

ప్రపంచ బ్యాంకు నిధులతో శింగనమల చెరువు అభివృద్ధి

- తూముల మరమ్మతులు, షట్టర్ల ఏర్పాటుకు చర్యలు
- అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయిన శింగనమల శ్రీరంగరాయచెరువు రూపురేఖలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. చెరువు తూములు, ఆయకట్టు కాలువలను ప్రపంచ బ్యాంకు నిధులతో అభివృద్ధి, మరమ్మతులు చేసేందుకు సమాయత్తమవుతోంది. గత టీడీపీ పాలనలో ప్రపంచ బ్యాంకు నిధులతో ఆయకట్టు కాలువలు, కొన్ని తూములు మరమ్మతులు చేశారు. తూములు ఎత్తే పద్ధతికి స్వస్తి పలికి షెట్టర్లు ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. అయితే చెరువులోనికి నీరు రావడంతో ఆ పనులు పూర్తి కాలేదు. తరువాత అధికారంలోని వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధులను వాడుకోలేదు. ఐదేళ్ల పాలనలో చెరువు మరమ్మతులు, ఆయకట్టు కాలువలపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం కూటమి పార్టీలు అధికారంలో ఉండటంతో చెరువు అభివృద్ధి పనులపై ఆశలు చిగురిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, శింగనమల

5వేల ఎకరాల్లో సాగు



తూములపై ఏర్పాటు చేసిన చెక్కలు, ఇసుప రాడ్లు


శింగనమల శ్రీరంగరాయ చెరువు కింద 5వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. ఈ చెరువు కింద అధికారికంగా 2800 ఎకరాల ఆయకట్టు ఉంది. శింగనమల, గోవిందురాయునిపేట, శివపురం, సి.బండమీదపల్లి, చక్రాయపేట, పోతు రాజుకాల్వ, పెరవలి, సోదనపల్లి, జూలాకాల్వ పరిధిలో మరో 2500 ఎకరాల్లో చెరువులో నీరు ఉంటే పంటలు పండిస్తారు. చెరువు నిండితే 40కి పైగా గ్రామాల్లోని బోర్లలో నీరు పుష్కలంగా లభిస్తుంది. 200కి పైగా మత్స్యకారుల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

పాతకాలం పద్ధతిలోనే...



పాతకాలం నాటి నీరు ఎత్తే తూములు

చెరువుకు పాత కాలం నాటి నాలుగు తూములు ఉన్నాయి. వీటి ద్వారానే ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తా రు. నీరు విడుదల కావాలంటే తూములపై ఏర్పాటు చేసిన ఇసుప రాడ్‌లు పైకి లేపాలి. అప్పుడే నీరు బయటికి పోతుంది. ఇసుపరాడ్‌లు ఎత్తే సమయంలో రాడ్‌కు ఉన్న మొద్దు జారిపోతే నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. అప్పుడు చెరువు కాలువలో 10 అడుగుల లోతుకు వెళ్లి ఆ మొద్దును తగిలించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం అంతటి గజ ఈతగాళ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అందుకే కాలువలకు షట్టర్లు ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పతిమల తూము లోపలి భాగం

ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4.5 కోట్లు మంజూరు

చెరువు అభివృద్ధి కోసం 2018-2019లో ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4.5 కోట్లు నిధులు మజురయ్యాయి. వాటితో చెరువులో నాలుగు తూములకు గ్యాంగ్‌వేర్ నిర్మించి, షట్టర్ల ఏర్పాటుకు చెరువు కట్టపై 3 మీటర్లు వెడల్పుతో మట్టి వేయించడం, చెరువు మరువపై మరమ్మతులు చేయడం, కాలువ మరమ్మతులు చేయడానికి ప్రతిపాదించారు. సుమారు రూ.3.70 కోట్లు ఖర్చు చేసి మరువపై లైనింగ్ పనులు, కాలువల మరమ్మతులు, చెరువుపై మట్టి పనులు చేశారు. అయితే తూముల వద్ద గ్యాంగ్‌వేర్, షట్టర్ ఏర్పాటు చేస్తున్న సమయంలో చెరువులోకి నీరు రావడంతో పనులు ఆగిపోయాయి. ఆగిపోయిన చెరువు గ్యాంగ్‌వేర్, షట్టర్ల ఏర్పాటు గురించి వైసీపీ ప్రభుత్వం అస్సలు పట్టించు కోలేదు. ఐదేళ్ల పాలనలో తమ సమస్యలు పట్టించుకోలేదని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ప్రపంచబ్యాంకు నిధులపై స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి, నూతన ఆయకట్టు కమిటీ సభ్యులు దృష్టి సారించారు.


రైతులకు మేలు చేయడానికే...



గత టీడీపీ పాలనలో రైతులకు మేలు చేయడానికి సంకల్పించాం. అందుకే చెరువు అభివృద్ధి, మరమ్మతుల కోసం ప్రపంచబ్యాంకు నుంచి రూ.4.50 కోట్లు మంజూరు చేయించాం. ఆ నిధులతో చెరువు చుట్టూ వాల్ నిర్మాణం, ఇతర అవసరమైన పనులు చేశాం. అయితే చెరువులో నీరు చేరడంతో షట్టర్లు అమర్చలేకపోయాం. రైతులకు చెరువు అభివృద్ధికి టిడిపి పార్టీ ముందు ఉంటుంది.

- నెట్టికంటి, ఆయకట్టు మాజీ ఉపాధ్యక్షుడు


కాలువ మరమ్మతులు చేయించాలి



ఐదేళ్ల కిందట కాలువలు మరమ్మతులు చేశారు. అప్పటి నుంచి కాలువల్లో ఎలాంటి పనులు చేయలేదు. కాలువలు అక్కడక్కడ ధ్వంసం కావడంతో చివరి భూముల వరకు నీరు చేరడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి కాలువలు మరమ్మతులు చేయాలి.

- గురప్ప, రైతు


షట్టర్లు ఏర్పాటు చేయిస్తాం



గత టీడీపీ పాలనలో చెరువు మరమ్మతులకు ప్రపంచ బ్యాం కు ప్రత్యేకంగా రూ.4.5 కోట్లు విడుదల చేసింది. అందులో రూ.3. 70 కోట్లు వివిధ పనుల కోసం ఖర్చు చేశారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో మిగిలిన నిధుల గురించి పట్టించుకోలేదు. నేను ఆయకట్టు అధ్యక్షుడు అయ్యాక ఈనిధులపై ఆరా తీశాం. మిగిలిన నిధులతో చెరువు తూముల మరమ్మతులు, నూతన షట్టర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తాం.

- సత్యనారాయణ, శింగనమల ఆయకట్టు అధ్యక్షుడు

అభివృద్ధికి కృషి చేస్తా



శ్రీరంగరాయ చెరువు ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా. మిగిలిన ప్రపంచ బ్యాంకు నిధులతో పాటు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు వచ్చి అభివృద్ధి పనులు చేపడతాం. చెరువులో నాలుగు తూములకు నూతన గ్యాంగ్‌వేర్‌తోపాటు షట్టర్లు, కాలువలు మరమ్మతులకు నిధుల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతా. చెరువు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా.

- బండారు శ్రావణి, ఎమ్మెల్యే

నీరు తగ్గాక షట్టర్ల ఏర్పాటు

శింగనమల చెరువులో తూములు మరమ్మతులు, తూముల వద్ద నూతన షట్టర్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం చెరువులో నీరు ఉండటంతో ఈ పనులు చేయడానికి వీలులేకుండా పోతోంది. అందుకే చెరువులో నీరు పూర్తిగా తగ్గిపోతే పనులు ప్రారంభిస్తాం.

- రాజ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ

పాడి రైతుల్లో ఆనందం..!

- ఆదుకున్న పశువుల బీమా
- గత ప్రభుత్వంలో అటకెక్కిన పథకం
- రైతుల ఖాతాలో పరిహారం జమ

తనకల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న పశువుల బీమా(నష్టపరిహారం) రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. గత వైసీపీ పాలనలో పశువుల బీమా కోసం ఎదురుచూసిన రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి ఎదురుచూపులు ఫలించాయి. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. కష్టకాలంలో కూటమి ప్రభుత్వం పాడిరైతులను ఆదుకోవడానికి పరిహారం అందించింది. పాడిపశువులు చనిపోతే బాధిత రైతులకు నష్టపరిహారం అందించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం పశు నష్టపరిహార పథకం ప్రవేశపెట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని ఏడాది పాటు కొనసాగించి, తరువాత నాలుగేళ్లు చేతులెత్తేసింది. దీంతో పాడి రైతులు నష్టపరిహారం కోసం పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నా, అధికారుల చుట్టు తిరిగినా స్పందించే నాథుడే కరువయ్యాడు. ఇంక నష్టపరిహారం రాదని రైతులు కూడా మరిచిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పశు బీమా పథకంపై దృష్టి సారించింది. పాడి రైతులకు ఆధారమైన పశువులు చనిపోతే పరిహారం అందచేసి, ఆదుకుంటామని గొప్పలుచెప్పిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆచరించడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఐదేళ్లుగా బీమా బకాయిలు పెరిగిపోయాయి. రైతులుకూడా వాటిని మరిచిపోయారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవడానికి నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేసింది. మండల వ్యాప్తంగా వందమంది రైతుల ఖాతాల్లో రూ.30 లక్షలు జమ అయినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. సత్యసాయి ఇల్లా వ్యాప్తంగా రూ.4.45 కోట్లు 1460మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా అధికారులు ధ్రువీకరించారు. జిల్లా వ్యాప్తంగా 1,836 పశువులు మృతిచెందినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో పొరపాట్లు ఉండడం వలన ఇంకా 60 మంది రైతులకు పరిహారం జమకావాల్సి ఉంది. త్వరలోనే అవికూడా జమ అవుతాయని అధికారులు తెలిపారు.


తవళం (గందోడివారిపల్లి) పశువైద్యశాల

రైతుల ఖాతాల్లో రూ.30 లక్షలు జమ



నాలుగేళ్ల క్రితం మండలంలో మృతిచెందిన పశువుల వివరాలు ప్రభుత్వానికి పంపాం. నాలుగేళ్లుగా రాని బీమా నేడు విడుదలైంది. మండలంలో వందమంది రైతుల ఖాతాల్లో రూ.30లక్షలు జమ అయింది.

- హరినాథ్‌రెడ్డి, పశువైద్యాధికారి, తనకల్లు

ఆనందంగా ఉంది..



మూడేళ్లక్రితం పశువు చనిపోతే, డాక్టర్లు వచ్చి పోస్టుమార్టం చేసి, బీమా వస్తుందన్నారు. అప్పటి నుంచి అధికారులు, కార్యాలయాల చట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక పరిహారం రాదని మరిచిపోయా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాడి రైతుల బాధను గుర్తించి ఖాతాలో రూ.30వేలు జమ చేయడం ఆనందంగా ఉంది.

- ఆదినారాయణ, ఎర్రబల్లి

కూటమి ప్రభుత్వం ఆదుకుంది



పాడిపశువు చనిపోతే ఎంతో ఇబ్బంది పడ్డా. పరిహారం కోసం సంబంధిత అధికారులు, కార్యాలయాల చుట్టు ప్రదక్షణలు చేశా. అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీశారు. రాదు అనుకుని మరిచిపోయా. కూటమి అధికారంలోకి రావడంతో ఖాతాల్లో నష్టపరిహారం జమ చేశారు. కష్టకాలంలో పాడి రైతులను ప్రభుత్వం ఆదుకుంది.

- చంద్రశేఖర్‌రెడ్డి, పాడిరైతు, పెద్దపల్లి

నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నా



పాడిపశువు చనిపోవడం రైతు కుటుంబంలో విషాదమే. ప్రభుత్వం పశువుల బీమా ఇవ్వడంతో కొంత ధైర్యంగా ఉన్నా. నాలుగేళ్ల నుంచి బీమా రాకపోవడతో కొంత నిరాశ చెందా. రాదు అనుకున్న బీమా ఖాతాలో జమ కావడంతో కష్టకంలో ఈ ప్రభుత్వం ఆదుకుంది.

- సుధాకర్, పాడిరైతు, గుంజువారిపల్లి

ఇసుక రీచ్ తనిఖీ

ముదిగుబ్బ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు ఇసుక రీచ్‌ను తహసీల్దార్ నారాయణస్వామి శనివారం తనిఖీ చేశారు. సమీపంలో ఉన్న వంకను పరిశీలించి ఇసుక రవాణాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బయట వాహనాలకు ఇసుకను లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటామని అక్కడున్న కూలీలను హెచ్చరించారు. రీచ్ నిర్వాహకులు వంకలోని ఇసుకను తరలించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

బత్తలపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రానికి సమీపం బైపాస్ జంక్షన్‌లో శనివారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు. సీట్‌బెల్ట్, హెల్‌మెట్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బత్తలపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో పేకాటస్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన మేరకు మండల కేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ.24,670 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు : డీఎస్పీ

ఓబుళదేవరచెరువు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు, ఇతర అధికారులను సమన్వయం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పారు. సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

21న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

పుట్టపర్తి టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతృహుస్సేన్ 21వ తేదీన జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. 21న ఉదయం బెంగుళూరు నుంచి బయలు దేరి, కదిరికి చేరుకుని, లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, అనంతరం రూరల్ పరిధిలోని రామదాసునాయక్‌తండా, బోడేనాయక్‌తండాలను సందర్శిస్తారన్నారు. అనంతరం ముదిగుబ్బ మండలంలోని జొన్నలకొత్తపల్లితండాను సందర్శించి, మధ్యాహ్న 2గంటలకు పుట్టపర్తి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం అయి. గిరిజన సంక్షేమం, పథకాల అమలుపై సమీక్షిస్తారన్నాని కలెక్టర్ తెలిపారు.

తిమ్మమ్మ మర్రిమానును పర్యాటక కేంద్రంగా గుర్తించాలి


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు

నంబులపూలకుంట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమానును పర్యటక కేంద్రంగా గుర్తించాలని అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తిమ్మమ్మ, బాలవీరయ్యను ఆయన దర్శించుకున్నారు. పంచాయతీ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునిరెడ్డి తిమ్మమ్మ మర్రిమాను సందర్శించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పిం,చారు. సర్పంచ్ విష్ణుమూర్తి, వెంకటనారాయణ, నారాయణస్వామి, హరినాథ్‌బాబు, రంగారెడ్డి, బాలవీరయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బ్రిడ్జి వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన చెత్తను పంచాయతీ అధికారులు తొలగింప చేశారు. కోళ్ల వ్యర్థాలతో దుర్గంధం అన్న కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు శనివారం ఎక్స్‌కవేటర్‌తో కొత్తచెరువు బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగింపచేశారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. చికెన్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఎవరైనా బ్రిడ్జికింద వ్యర్థాలను పడేస్తే వారికి జరిమానాలతో పాటు కేసులు నమోదు చేయిస్తామని ఈఓ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


కొత్తచెరువులో చీపురు పట్టి శుభ్రం చేస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, కమిషనర్ ప్రహ్లాద, మాజీచైర్మన్లు పీసీగంగన్న, బెస్తచలపతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతవైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి

ధర్మవరం: రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వచ్ఛతవైపు నడిపించేలా అడుగులు వేస్తున్నారని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. పట్టణంలోని హిందూ శ్మశానవాటిక సమీపంలో ఏర్పాటు చేసిన పార్క్ స్థలంలో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివాస్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిటాలశ్రీరామ్, మున్సిపల్ అధికారులు, సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ స్థలంలో ముళ్లకంపలు, చెత్తా చెదారాన్ని శుభ్రంచేశారు.

కొత్తచెరువు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దర్గావీధిలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఎంపీడీఓ నటరాజ్, పంచాయతీఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్మికులతోకలిసి రాయల్‌సర్కిల్‌లో రోడ్లను జేసీ చీపురుతో శుభ్రం చేశారు.

ధర్మవరంరూరల్: పరిసరాలు మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ మహేష్ అన్నారు. మండలంలోని పోతుకుంట గ్రామంలో ఆర్డీఓ చీపురు పట్టి రోడ్డుపక్కన ఉన్న చెత్తాచెదారాన్ని ఊడ్చారు.

తనకల్లు: మండలకేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్‌పై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రెడ్డెప్ప, సర్పంచ్ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ ఆంజనమ్మ పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక సచివాలయంలో శనివారం స్వచ్ఛాంధ్రా, స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, వెలుగు ఉఏపీఎం గోపాల్, పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్‌వరకు ర్యాలీ చేశారు. నాయకులు, అధికారులు మార్కెట్ ఆవరణలో చెత్త, మురుగును శుభ్రం చేశారు. ఈఓఆర్డీ దివాకర్, పంచాయతీ కార్యదర్శి మంజుల, వెలుగు ఏపీఎం హేమలత, టీడీపీ మండలకన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలకేంద్రంలోని ఎస్టీకాలనీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఈఓఆర్డీ శకుంతలబాయి, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

బుక్కపట్నం: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒకరు పాటించాలని డీఎల్‌పీఓ చక్రపాణి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ నాగలక్ష్మీరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక తేరు సర్కిల్‌లో మానచీపురు పట్టి శుభ్రం చేస్తున్న జేసీ అభిషేక్‌కుమార్‌వహారం ఏర్పాటుచేశారు. ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాదిక్ బాషా, కన్వీనర్ చింతా మల్లిరెడ్డి పాల్గొన్నారు.


ధర్మవరంలో రోడ్డు పక్కన చీపురుతో ఊడ్చుతున్న ఆర్డీఓ మహేష్

న్యూస్ బాక్స్

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష


ధర్మవరంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

ధర్మవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి):జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవోదయ ప్రవేశపరీక్ష కేంద్రాలను డీఈఓ కిష్టప్ప శనివారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల, బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలలో నవోదయ ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. మొత్తం రెండు కేంద్రాలలో 403 మందికిగాను 306 మంది పరీక్షలు రాశారు. 97 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా ఫలితాలు రెండు నెలల తరువాత ప్రకటిస్తారన్నారు. పరీక్ష చీఫ్‌లు శైలజ, రాంప్రసాద్, సీఎల్ఓలు నర్సింగరాజు, అనంత పద్మనాభం పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: నవోదయ ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పరీక్షలు సజావుగా సాగాయి. పట్టణంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 288మందిగాను 251మంది, బాలికల ఉన్నతపాఠశాలలో 264కి 191, మున్సిపల్ వీవర్సుకాలనీలో 230కి 187మంది, కుటాగుళ్ల మున్సిపల్ పాఠశాలలో 213కు 140మంది పరీక్షలు రాశారు.

కార్మికచట్టాల అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం


నినాదాలు చేస్తున్న సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

ధర్మవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, జనవిజ్ఞన వేదిక డాక్టర్ ఆదిశేష అన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం సీఐటీయూ, ప్రజా సంఘాల సమావేశాన్ని జేవీరమణ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు సంబంధించిన 44 చట్టాలను కేవలం నాలుగు కోడ్‌లుగా కుదిస్తున్నారని, కార్మికహక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. సీఐటీయూ మండల కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, బొగ్గునాగరాజు, జయచంద్ర, దస్తగిరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కళాకారులకు అవార్డుల ప్రదానం


అవార్డులు అందుకున్న కళాకారులు

ధర్మవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శుక్రవారం నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ధర్మవరానికి చెందిన లలితా నాట్య కళానికేతన్ కళాకారులు ప్రతిభ కనబరిచారు. నాట్యగురువులు బాబు బాలాజీ, కమల బాలాజీ, 30 మంది కళాకారులు కూ చిపూడి నాట్యం ప్రదర్శించారు. 20 మందికి నాట్యమయూరి అవార్డులు, 8 మందికి స్వర్ణనంది అవార్డులు, హర్షశ్రీ, రామలాలిత్యలకు నాట్యరాజ హంసఅవార్డులు దక్కాయి. వీరికి నిర్వాహకులు వీరేశ్‌యాదవ్, ప్రముఖ విద్వాంసులు దైవజ్ఞశర్మ చేతులమీదుగా అవార్డులను ప్రదానం చేశారు.నాట్యగురువు బాబు బాలాజీకి బ్రహ్మ అవార్డును ఇచ్చి సత్కరించారు.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలపై సమావేశం

ధర్మవరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై రైల్వే వినియోగదారుల సలహాసంఘం శనివారం సమావేశాన్ని నిర్వహించింది. రైల్వేస్టేషన్ మాస్టర్ చల్లా నరసింహానాయుడు, సలహాసభ్యులు విశ్వనాథ్, కోటి వెంకటేశ్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గోనుగుంట్ల సూర్యనారాయణ, ముఖ్య ఆరోగ్య పర్యవేక్షకుడు దామోదర మూర్తి, ఎలక్ట్రికల్ ఇంజనీర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రైల్వే పోలీసు అధికారి యాదయ్య, వర్క్స్ ఇంజనీర్ ఉమేశ్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా అన్ని ప్లాట్‌ఫారాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, లిఫ్ట్, ఎస్కలేటర్ సౌకర్యాన్ని అత్యవసరంగా కల్పించాలని, నాలుగు, ఐదు కదిరి తిరుపతికి వెళ్లే ప్లాట్‌ఫాం లైన్లో బుకింగ్ కౌంటర్ గానీ ఏటీఎం ఏజెంటు గానీ ఏర్పాటుచేయాలన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం


ఎన్నికలు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి స్వర్ణలత

ధర్మవరంరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లి పంచాయతీకి సంబంధించి తిక్కయ్యస్వామి గొర్రెలపెంపకందారుల సంఘం ఎన్నికలు శనివారం వసంతపురం గ్రామంలో నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి స్వర్ణలత తెలిపారు. సభ్యులంతా కలిసి అధ్యక్షుడిగా మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా మునెప్ప, డైరెక్టర్లుగా నారాయణస్వామి, పెద్దకాటమయ్య, నరసింహులు, చిన్నకాటమయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బ్రహ్మ బాబాకు నివాళి

తనకల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం బ్రహ్మబాబా వర్ధంతిని నిర్వహించారు. బ్రహ్మకుమారి నిర్మల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని కొనసాగించారు. కేంద్రాల్లోని యువతలు ప్రేమ, శాంతి, వివేకానికి దీటుగా నిలిచారన్నారు. వెంకటేష్, పలువురు మహిళలు పాల్గొన్నారు.


బ్రహ్మ బాబా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న భక్తులు

తారకరాముడికి ఘన నివాళి

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని పలువురు నాయకులు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ధర్మవరంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, నాయకులు సామ కోటి ఆదినారాయణ, రమేష్, బేకరి నాయుడు, జయప్రకాష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ తెలుగు వారికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. **- న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి**


కదిరిలో రక్తదానం చేస్తున్న క్రిష్ణమోహన్‌నాయుడుతో ఎమ్మెల్యే కందికుంట


పుట్టపర్తిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి


ధర్మవరంలో పరిటాల శ్రీరామ్, టీడీపీ నాయకులు


ముదిగుబ్బలో రమేష్‌బాబు, ప్రభాకర్, మహబూబ్ పీరా తదితరులు


తాడిమర్రిలో కూచి రాము, భూష్, హర్ష, పక్కీరప్ప తదితరులు


నంబులపూలకుంటలో నరసింహులు, శ్రీరాముల నాయుడు, రెడ్డెప్ప


నల్లమాడలో శివశంకర్, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు


నల్లచెరువులో రాజశేఖర్, శివారెడ్డి, మాబూసాబ్, అబ్దుల్ ఖాదిర్ తదితరులు


గాండ్లపెంటలో కొండయ్య, ఆనంద్, అక్రమ్, నరసింహులు తదితరులు


ఓబుళదేవరచెరువులో నాయకుల నివాళి


బుక్కపట్నంలో...


బత్తలపల్లిలో నారాయణరెడ్డి, చల్లా శ్రీనివాసులు తదితరులు

న్యూస్ బాక్స్

ఉపాధి పనులు తనిఖీ చేసిన కలెక్టర్



బూదిలిలో పశువుల పాకను పరిశీలిస్తున్న కలెక్టర్

గోరంట్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి పంచాయతీలోని జాతీయ గ్రామీణ ఉపాధి పనులను కలెక్టర్ టిఎస్ చేతన్ శనివారం తనిఖీ చేశారు. బూదిలి గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన క్యాటిల్ షెడ్‌ను పరిశీలించారు. లబ్దిదారుడు శ్రీరాములతో మాట్లాడుతూ క్యాటిల్ షెడ్ వల్ల రైతులకు జరిగే ప్రయోజనం గురించి, చేకూరే లబ్ధి గురించి సాదక, బాధలను అడిగి తెలుసుకున్నారు. పాల ఉత్పత్తి వల్ల రైతులు ఎంతో అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, అధికారులు గోవర్ధన్. హరి, ఏపీఓ వరప్రసాద్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఇంకా వైసీపీ పోస్టర్లా..?



ఆసుపత్రిలో నేటికీ దర్శనమిస్తున్న వైసీపీ పోస్టర్లు

పరిగి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి ఏడునెలలు గడిచినా ఇప్పటికీ పరిగిలో వైసీపీ ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేయడానికి వెళితే ప్రవేశ ద్వారం వద్ద మునుపటి వైసీపీ ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్లనాని ఫ్లెక్సీలు కనబడుతున్నాయి. దీంతో టీడీపీ నాయకులు ఆరోగ్య సిబ్బందికి ఫ్లెక్సీలు మార్చుకోవడానికి నిధులు లేకపోతే తమకు తెలియజేస్తే ఫ్లెక్సీలకు అయ్యే ఖర్చును చెల్లిస్తామన్నారు. వైసీపీ హయాంలో ఉన్న ఆరోగ్య పథకాల జాబితాతోపాటు, వైసీపీ నాయకుల ఫోటోలను ప్రదర్శన బోర్డులోపెట్టి టీడీపీ నాయకులను అవమానపరచవద్దని ఆసుపత్రి సిబ్బందిని దుయ్యబట్టారు.

జగద్గురువులకు ఘనస్వాగతం



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): శృంగేరీ పీఠాధిపతి జగద్గురు విధుశేఖరభారతీ స్వామికి ఘనస్వాగతం లభించింది. పులమతి రోడ్డులోని రాజరాజేశ్వరీ ఆలయంలో కుంభాబిషేకం కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి పట్టణ పరిధిలోని గాయత్రిదేవి ఆలయానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు స్వామీజీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ ఆలయంలో మూలవిరాట్‌ను సందర్శించి చంద్రమౌళేశ్వర స్వామి పూజల్లో పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ ఆలయంలో నారికేళ హోమం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

హిందూపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని శ్రీకంఠపురం పులమతి రోడ్డులో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో శనివారం ఉదయం వేదపారాయణ, అష్టోత్తరనారికళ హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

హిందూపురం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రహమత్‌పురంలో నివాసముండే అల్లాబకష్ బీరువాల పని చేసుకుంటూ జీవనం చేసేవాడు. అతని భార్య తబస్సుమ్ అదే ప్రాంతానికి చెందిన నదీం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వీళ్ల పరిచయానికి భర్త అడ్డు వస్తాడని భావించి ఇద్దరూ కలిసి అతన్ని గంతు బిగించి చంపినట్లు మృతుడి తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి ముద్దాయిలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

గుండెపోటుతో బీకాం విద్యార్థిని మృతి

పావగడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైతఈ రంగయ్యశెట్టి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీకాం చదువుతున్న మిడిగేసి ప్రాంతానికి చెందిన మైతిలి(19) అనే విద్యార్థిని శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందింది. మిడిగేసి గ్రామానికి చెందిన మైథిలి శనివారం ఉదయం చళికెర క్రాస్ సమీపంలోకి రాగానే కళ్లుతిరిగి ఒక్కసారిగా కిందపడిపోవడంతో తోటివిద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించే సరికి అప్పటికే మృతిచెందిందని తెలిపారు. ఒక్కగానొక్క కుమార్తె అకస్మాత్తుగా మృతిచెందడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వారి తల్లిదండ్రుల ఆర్తనాదాలు అందరినీ కంట తడిపెట్టించాయి. విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని కళాశాల సిబ్బంది విద్యార్థులు ఆసుపత్రి ఆవరణంలో సంతాపం వ్యక్తం చేశారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

గుడిబండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపురుగుండు గ్రామానికి చెందిన మాలింగప్ప అనే వ్యక్తి వద్ద నుండి 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. మోపురుగుండులో విక్రయిస్తున్న సమయంలో మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

ఆధార్ సెంటర్లలో తప్పని తిప్పలు

మడకశిర రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ సెంటర్లు ఏర్పాటుచేసినా ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడంలేదు. ప్రజలు, విద్యార్థులు ఆధార్ కార్డులోని పేర్లు, చిరునామా, వయస్సు లాంటి తప్పులను సరిచేసుకోవడానికి ఈ సెంటర్లు ఏర్పాటుచేశారు. కాని ఈ కేంద్రాలకు వచ్చే వారికి సరియైన సేవలు అందించడంలేదన్న విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. నిర్వాహకులు చాల మందిని సాంకేతిక కారణాలు చూపుతూ వెనక్కి పంపుతున్నారు. దీంతో ప్రజలు ఆ సెంటర్ల నిర్వహణ పై అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఆధార్ అప్డేట్‌కు రుసుంగా రూ.50 చెల్లించాల్సి ఉండగా వందరూపాయలు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎంతో కష్టపడి దరఖాస్తు చేతితో రాసుకొస్తే అది చెల్లదని, టైపింగ్ చేసిన దరఖాస్తులు తీసుకు రావాలని వెనక్కి పంపుతున్నారు. సెంటర్ సమీపంలో ప్రైవేట్ రూమ్‌లో టైపింగ్ చేసిన దరఖాస్తులను అమ్ముతున్నారు. అక్కడ టైపింగ్ చేసిన దరఖాస్తులను వంద రూపాయలు చెల్లించి తీసుకురావాలని నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. దీంతో చాల మంది విధిలేని పరిస్థితుల్లో వారు అడిగిన మొత్తం చెల్లించి ఆధార్ అప్డేట్ చేయించుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకొని ఆధార్ సెంటర్‌ను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ అప్డేట్‌కు అధిక మొత్తంలో వసూళ్లు

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ లో అప్డేట్ చేయించుకోవాలంటే అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. దీంతో ఎంతో దూరం నుంచి వచ్చిన వారు ఇబ్బంది లెదుర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.



మురళిబాబు, టీఎన్ఎస్ఎఫ్

మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో ఎంట్రీలు నిల్

- రత్నగిరి సచివాలయంలో కనిపించని సిబ్బంది
- రకరకాల వంకలతో గైర్హాజరు

రొళ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది రాకపోకల వివరాలు తెలియజేసేందుకు ఒక మూమెంట్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేశారు. కానీ రత్నగిరి సచివాలయ మూమెంట్ రిజిస్టర్‌లో 10వతేదీ నుండి ఇప్పటి వరకు ఒక్క ఎంట్రీ కూడా నమోదు కాకపోవడం విచిత్రం. దీనిపై సచివాలయ కార్యదర్శిని ఫోనులో వివరణకోరగా తాను మండల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నానని తెలిపారు. పూర్తి బాధ్యత సచివాలయ కార్యదర్శికి ఉండటంతో ఆమె కూడా మూమెంట్ రిజిస్టర్‌లో ఆరు రోజుల నుండి ఎంట్రీలు నమోదు చేయకపోవడానికి కారణం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఇతర అధికారులు ఎక్కడ ఉంటారో ఏమో తెలియని పరిస్థితి ఏర్పడింది. రత్నగిరిలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను అడుగగా తాను సీసీ రోడ్డు వేయిస్తున్నానన్నారు. వీఆర్ఓను అడుగగా తాను తహసీల్దార్ ఆఫీసులో ఉన్నానని చెప్పారు. ఇలా ప్రతి ఒక్కరూ తలా ఒక కారణం చెప్పారు. ఈవిధంగా గ్రామ సచివాలయ పనితీరు ఉందని మండల ప్రజలు వాపోతున్నారు. దీనికి కారణం ఉన్నతాధికారులు తనిఖీ చేయకపోవడమేనని మండల ప్రజలు అంటున్నారు. ఈవిషయమై ఈఓఆర్డీ బాబూరావుని వివరణ కోరగా ప్రతి అధికారి మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకొంటామని తెలిపారు.



రత్నగిరి కార్యాలయంలో ఇద్దరు మాత్రమే కనిపిస్తున్న దృశ్యం

కలిసికట్టుగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం

- వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు

సోమందేపల్లి,జనవరి18(ఆంధ్రజ్యోతి):పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితం చేసి అన్ని పార్టీల నాయకులు కలిసి మిగిలిన సమయంలో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీపీ గంగాదేవి మాట్లాడుతూ అభివృద్ధి కోసం పార్టీలను పక్కనబెట్టి కూటమి ప్రభుత్వానికి సహకరించేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. ఎంపీడీఓ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి సమన్వయంగా పనిచేసి ప్రణాళికలు రూపొందించుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ భవనాలకు బ్రాహ్మణపల్లిలో లోవోల్టేజి సమస్య పరిష్కరించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ నూతన భవనాలను నిర్మించి ఇవ్వాలన్నారు. వృధాగా పడిఉన్న బస్‌షెల్టర్‌ను ప్రారంభించి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, తహీసల్దార్ రెడ్డిశేఖర్, వైద్యులు ఓంకార్ పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్

మా వృత్తిని మాకు వదలరా..?

నాయీ బ్రాహ్మణ నాయకుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న నాయీ బ్రాహణ సంఘం నాయకులు

హిందూపురం అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఇదేమి కాలవైపరీత్యమో తెలియదు కాని కొందరు తమ వృత్తికి అడ్డుతగులుతున్నారని నాయీ బ్రాహ్మణసంఘం నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వం కొన్ని కులాలవారు కొన్ని వృత్తులు నిర్వహించేవారన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఉన్న వృత్తి క్షవర వృత్తి అన్నారు. అయితే తమ కడుపు కొట్టే విధంగా కొంత మంది కార్పొరేట్ తరహాలో ఖరీదైన చేతివృత్తులను (సెలూన్ షాపు) ఏర్పాటు చేసుకొని తమ కడుపుమీద కొడుతున్నారని ఆవేదన చెందారు. దీంతో తమకు జీవనోపాధి తగ్గిపోయిందన్నారు. కాబట్టి అధికారులు నాయకులు స్పందించి ఇతరులకు సెలూన్‌లకు అనుమతులు ఇవ్వకుండా సహకరించాలని కోరారు. ఈ విషయంపై సోమవారం ఉదయం 10 గంటలకు త్యాగరాజనగర్‌లోని సీతారామాంజనేయ దేవాలయం వద్దకు నాయీ బ్రాహ్మణులు చేరుకోవాలని కోరారు. ఉదయం 10 గంటలకు ర్యాలీగా వెళ్ళి తహసీల్దార్‌కు, మునిసిపల్ కమిషనర్‌కు, ఎం.ఎల్.ఏకు వినతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నాగరాజు, అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి నాగేంద్రప్రసాద్, సలహాదారులు శ్రీధర్, రామాంజి, ఉపాధ్యక్షుడు రమేష్, ఉపకార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళ అని చూడకుండా చిత్రవధ చేశారు

- టీడీపీ నాయకులు వద్ద బాధితురాలి ఆవేదన



నాయకులతో తన బాధను చెప్పుకుంటున్నబాధితురాలు

పెనుకొండ రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మహిళ అని కూడా చూడకుండా ఒంటిపై బట్టలు లేకుండా తనను చిత్రవధచేశారని పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన వివాహిత వెంకటలక్ష్మీ టీడీపీ నాయకులవద్ద మొరపెట్టుకుంది. మండలంలోని మునిమడుగు గ్రామంలో మూడు రోజుల క్రితం ప్రేమజంటకు సహకరించిందని ఓ యువతి కుటుంబ సభ్యులు వెంకటలక్ష్మీపై దాడిచేసి జుత్తు కత్తిరించిన సంగతి తెలిసిందే. శనివారం వెంకటలక్ష్మీ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతోంది. అయితే ఈ క్రమంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టీడీపీ నాయకులు ఆసుపత్రిలో పాలు, బ్రెడ్డు పంపిణీ చేస్తుండగా బాదిత మహిళ వెంకటలక్ష్మీ వారి కాళ్లపై పడి న్యాయం చేయాలంటూ మొరపెట్టుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంఘటనపై పోలీసులకు 20మందిపై ఫిర్యాదు చేయగా 13మందిపైనే కేసు నమోదు చేశారు. కేసు నమోదుచేసిన వారిని ఇంతవరకు అరెస్ట్ చూపలేదని బాధితురాలు వాపోయింది. తనపై దాడి జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు కేసును వెనక్కు తీసుకోవాలని బెదిరింపు కాల్స్ వస్తున్నాయని వాపోయింది. న్యాయం జరగకపోతే తానెందుకు బతికి ఉండాలని టీడీపీ నాయకులతో వాపోయింది.

పేదల పెన్నిధి ఎన్టీఆర్

వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకుల ఘననివాళి



హిందూపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నాయకుల నివాళులు



చిలమత్తూరులో...



పెనుకొండలో..



సోమందేపల్లిలో ముగ్గు వేస్తున్న రామాంజి



ఆసుపత్రిలో గుండుమల తిప్పేస్వామి పండ్ల పంపిణీ

పేదల పెన్నిధి ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. గోరంట్లలోని సినిమాథియేటర్ వద్దనుంచి బస్టాండ్ కూడలి వరకు నిమ్మల క్రిష్టప్ప అనుచరులతో ర్యాలీగా వెళ్లి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని హిందూపురం రూరల్ మండలంలో తూమకుంట చెక్‌పోస్టులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పెనుకొండలోనూ, మిట్టమీదపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.



గుడిబండలో ...

స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ఊరువాడా ర్యాలీలు జరిగాయి.



పరిగిలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



గోరంట్లలో స్వచ్ఛ ఆంధ్రపై మానవహారం



అమరాపురంలో ర్యాలీ